# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ ఆధునికతతో ఆధ్యాత్మికత సమ్మేళనమే భారతీయ నాగరికతకు గొప్ప బలమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

❖ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అసోం కీలక భూమిక పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

❖ "వీబీ జీ రామ్ జీ" బిల్లు గ్రామాలలో గణనీయమైన అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

❖ విద్యార్థులు దేశ ప్రగతికి ప్రధాన చోదక శక్తులుగా మారాలని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పిలుపునిచ్చారు.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.." కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28న ప్రసారమవుతుంది.

======================

ఆధునికతతో ఆధ్యాత్మికత సమ్మేళనమే భారతీయ నాగరికతకు గొప్ప బలమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. వసుధైవ కుటుంబకం అనే భావన ప్రపంచ శాంతికి అత్యంత అవసరమని చెప్పారు. హైదరాబాద్ లో బ్రహ్మ కుమారీస్ శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సదస్సులో రాష్ట్రపతి ప్రసంగించారు. భారతీయ ఆధ్యాత్మిక వారసత్వం ప్రపంచంలోని మానసిక, నైతిక, పర్యావరణ సమస్యలకు తగిన పరిష్కారాలను అందిస్తుందని ఈ సందర్భంగా రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

======================

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అసోం కీలక భూమిక పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అభివృద్ధిలో అసోం కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోందని చెప్పారు. గువహటీలోని లోకప్రియ గోపీనాథ్ బార్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం నూతన టెర్మినల్ భవనాన్ని ప్రధానమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ టెర్మినల్ వెలుపల అసోం రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి గోపీనాథ్ బార్డోలోయ్ విగ్రహాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. దాదాపు 1.4 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ కొత్త టెర్మినల్ భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... గత 11 సంవత్సరాలలో రాష్ట్రంలో అనేక లక్షల కోట్ల రూపాయల విలువైన కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ప్రారంభించడమే కాకుండా పూర్తి చేశామని చెప్పారు. అసోంలో సాగుతున్న ప్రగతి మొత్తం ఈశాన్య ప్రాంతాలను సైతం ప్రభావితం చేస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

అంతకు ముందు పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలోని రాణా ఘాట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుమారు 3 వేల 200 కోట్ల రూపాయల విలువైన రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, ప్రారంభోత్సవం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా ఆరవ అతి పెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన దుస్తుల ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ (AEPC) అవార్డుల కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. దేశ ఆర్థిక వృద్ధికి వస్త్ర పరిశ్రమ కీలకంగా మారిందని చెప్పారు. దేశంలో వ్యవసాయం తర్వాత రెండవ అతిపెద్ద ఉద్యోగ అవకాశాలను కల్పించేదిగా వస్త్ర పరిశ్రమ నిలుస్తుందని అన్నారు. వస్త్ర పరిశ్రమలో పర్యావరణ అనుకూల తయారీ పద్ధతులను అవలంబించాలని ఉప రాష్ట్రపతి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సశస్త్ర సీమా బల్ (SSB) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దళంలోని సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో ప్రధానమంత్రి SSB అచంచలమైన అంకితభావం, సేవ, త్యాగం అత్యున్నత సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. దేశ భద్రతకు కీలకమైన స్తంభంగా SSB నిలిచిందన్నారు. దేశాన్ని రక్షించడంతో పాటు దేశ సేవలో SSB ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని నరేంద్ర మోదీ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉమ్మడిగా ప్రజారోగ్య సవాళ్లను ఎదుర్కోవాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు. దీని కోసం దేశాల మధ్య సహకారం, సమన్వయం, అలాగే నిరంతర ప్రయత్నాలు అవసరమని అన్నారు. న్యూఢిల్లీలో నూతనంగా ప్రారంభించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా ప్రాంతీయ కార్యాలయాన్ని (WHO SEARO) కేంద్రమంత్రి ఈ రోజు సందర్శించారు. ఆగ్నేయాసియా ప్రాంతంలోని ఆయా దేశాల మంత్రులు, సీనియర్ ప్రతినిధులతో జేపీ నడ్డా సంభాషించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ... ప్రాంతీయ స్థాయిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారాన్ని మరింత అధికం చేయడానికి భారతదేశం నిబద్ధతతో పని చేస్తుందని స్పష్టం చేశారు. WHO SEARO కేవలం భవనం మాత్రమే కాదని, ఇది ఆగ్నేయాసియా ప్రాంత ప్రజల ఉమ్మడి ఆకాంక్షలకు, సామూహిక సంకల్పానికి శక్తివంతమైన చిహ్నమని కేంద్రమంత్రి అభివర్ణించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థులు దేశ ప్రగతికి ప్రధాన చోదక శక్తులుగా మారాలని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పిలుపునిచ్చారు. పుణెలోని సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ 22వ స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ... వికసిత్ భారత్- 2047 లక్ష్యాలను సాధించడానికి యువత సహకారం అవసరమన్నారు. ప్రపంచంలో భారతదేశం తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి వీలైనన్ని ఎక్కువ మిత్ర దేశాలను కలుపుకోవాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి భారతదేశం తన ఉత్పాదక సామర్థ్యాలు, సాంకేతిక అభివృద్ధిని పెంపొందించుకోవాల్సి ఉంటుందని జై శంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ రోజ్ గార్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ జీ రామ్ జీ) బిల్లుతో  రైతులు, కార్మికులకు ప్రయోజనకరంగా ఉండటమే కాకుండా గ్రామాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన చౌదరి చరణ్ సింగ్ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... వీబీ జీ రామ్ జీ బిల్లుతో దేశ గ్రామీణ రంగానికి ఊతమిచ్చినట్లు అవుతుందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పశ్చిమ హిమాలయ ప్రాంతంలో రానున్న నాలుగు రోజుల పాటు మంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) పేర్కొంది. జమ్మూ - కాశ్మీర్, లడఖ్‌లోని ప్రదేశాలలో రేపు భారీ హిమపాతం ఉంటుందని తెలిపింది. ఢిల్లీ, ఉత్తరాఖండ్, హర్యానా, చండీగఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఉత్తర మధ్యప్రదేశ్, బీహార్‌లలో రేపు దట్టమైన పొగమంచు పరిస్థితులు ఉండే అవకాశం ఉందని వెల్లడించింది.  అదే విధంగా తెలంగాణ, కర్ణాటకలలో కూడా అధిక చలిగాలులతో కూడిన పరిస్థితులు ఉంటాయని ఐఎండీ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనుంది. ఈ ప్రపంచ కప్ ఆడే భారత జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ రోజు ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ గానూ, అక్షర్ పటేల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రపంచ కప్ మ్యాచ్‌లు ఫిబ్రవరి 7న ప్రారంభమై... మార్చి 8 వరకు జరగనున్నాయి. భారత్ గ్రూప్ స్టేజిలో తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న యూఎస్ఏతో ఆడనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =